

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 168 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 19, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# నిధుల వాడకంలో.. నిలువు దోపిడీ !

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్ :**

దేశంలో పెరిగిపోతున్న అవినీతి దోపిడిని నిర్మూలించాలని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా హెచ్చరించారు.ప్రభుత్వ నిధులను ఆదా చేయాల్సిన అధికార యంత్రంగాలు ఇష్టారాజ్యంగా దుర్వినియోగపరుస్తూ అధికారిక లెక్కలను ఆదర్శంగా చూపడాన్ని తీవ్రంగా ఖండించారు.దేశవ్యాప్తంగా 12 సంవత్సరాలుగా జరుగుతున్న క్షేత్రస్థాయి అవినీతిని ఏ ఒక్కరు ప్రశ్నించింది లేదు గాని ఇంధనం ఆదా చేయండని మోడీ పలికిన ఒక్క మాటకే ప్రభుత్వ ఉన్నతాధికారులు సైతం ప్రజా సొమ్మును ఆదా చేస్తున్నామన్న భ్రమలో నిద్రపోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాలు ఏ విషయంలో చూసినా కేవలం పేద ప్రజలను ఇబ్బందుల పాలు చేసే కార్యక్రమాలకు మాత్రమే శ్రీకారం చుడుతున్నారని ఈ మధ్యకాలంలో అన్ని రకాలుగా పెరుగుతున్న నిత్యవసరాల ధరలు వాటిని బలపరుస్తున్నాయన్నారు. పురాతన కాల పరిస్థితులను మరల ప్రభావితం చేసే విధంగా ముఖ్యమంత్రులు ప్రధాన మంత్రి ప్రతి బహిరంగ సభలలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న విధానం దేశ పాలన పాలించలేమనే అసమర్థపు సాంకేతాలను తెలియజేస్తుందని వివరించారు.మణిపూర్, ఉత్తరప్రదేశ్ మహారాష్ట్ర బీహార్ చత్తీస్గడ్ ఆంధ్రప్రదేశ్ పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాలలో ప్రజలు ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు వలసలకు వెళుతూ జీవనోపాధి కొనసాగిస్తున్నారని తెలిపారు.రాజకీయ నాయకులంతా ఒకవైపు డబ్బు సంపాదించుకోవడం కోసం రాజకీయాలను కొనసాగిస్తుండగా

- మిగతా 2లో..

- నిధుల దుర్వినియోగంలో నిర్లక్ష్యం
- ప్రజాధనాన్ని ప్రజాభివృద్ధి కొరకు వాడుతున్నది ఎంత
- ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోతున్న ప్రభుత్వాలు
- దేశంలో పెరిగిపోతున్న అసాంఘిక శక్తుల ఆగడాలు
- ఎక్కడ చూసినా అధికారికంగా దోచుకునే స్థాయికి పెరిగిన అవినీతి
- పార్లమెంటులో ప్రవేశపెడుతున్న బడ్జెట్ అంత్యధికంగా పక్కదారి పడుతుంది
- అసెంబ్లీలలో ప్రవేశపెడుతున్న బడ్జెట్ అంత అగమవుతుంది
- 12 ఏళ్ల దుబారా ఖర్చును ఇంధనం ఆదాతో పోల్చుతున్నారు
- ప్రజలను వేధిస్తున్న ప్రభుత్వాలకు పాలించే హక్కు లేదు
- అక్రమ మార్గంలో ప్రభుత్వ సొమ్మును బడే దోచుకుంటున్నారు
- డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

ఈరోజు రవీంద్రభారతిలో జరిగిన మేడే కార్యక్రమంలో భాగంగా

## శ్రమశక్తి అవార్డును

గౌరవ కార్మిక శాఖ మంత్రివర్యులు శ్రీ వివేక్ వెంకటస్వామి గారి చేతుల మీదుగా అందుకున్న డాక్టర్ చిలుకు స్వామి గారు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసిన ప్రతిష్టాత్మక **"శ్రమ శక్తి అవార్డు"** అందుకున్న సందర్భంగా **డాక్టర్ చిలుకు స్వామి గారు, దళిత బంధువు - బహుజన వర్గాల ఆశాజ్యోతి,** పద్మశ్రీ గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ గారిని కలిసి ఆశీస్సులు పొందిన అరుదైన సందర్భం.




ఈ సందర్భంగా ప్రముఖ నాయకులు, సహచరులు కలిసి డాక్టర్ చిలుకు స్వామి గారిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# జైలు భోజనం ముట్టని భగీరథ్.. పాలు, బ్రెడ్డుతోనే తొలిరోజు!

**పోక్సో కేసులో చర్లపల్లి జైలుకు బండి భగీరథ్**
**సాధారణ ఖైదీలతో కలిపి బ్యారక్‌లో ఉంచిన అధికారులు**
**10 రోజుల కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయనున్న పోలీసులు**
**విచారణకు ఎఫ్ఎస్ఎల్‌కు భగీరథ్ ఐఫోన్, ఇతర ఆధారాలు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

పోక్సో కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌పై చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉన్న బండి సాయి భగీరథ్‌ను అధికారులు సాధారణ ఖైదీగానే పరిగణిస్తున్నారు. ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించకుండా, విచారణ ఖైదీలు ఉండే బ్యారక్‌లోనే ఆయనను ఉంచారు. జైలులో తొలిరోజు ఆహారం తీసుకోలేదని, కేవలం జైలు క్యాంటీన్ నుంచి తెప్పించుకున్న పాలు, బ్రెడ్డుతోనే సరిపెట్టుకున్నారని తెలిసింది. పోక్సో కేసులో కోర్టు రెండు వారాల రిమాండ్ విధించడంతో పోలీసులు శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో భగీరథ్‌ను చర్లపల్లి జైలుకు తీసుకొచ్చారు. అక్కడ వైద్య పరీక్షలు, ఇతర ఫార్మాలిటీలు పూర్తి చేసిన అనంతరం నేరుగా విచారణ ఖైదీల బ్యారక్‌కు తరలించారు. ఆదివారం ఖైదీలకు పెట్టే మాంసాహారాన్ని కూడా భగీరథ్ తీసుకోలేదని సమాచారం. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా ఆయన ఉన్న బ్యారక్ వైపు ఇతర ఖైదీలు వెళ్లకుండా సిబ్బందికి ఉన్నతాధికారులు స్పష్టమైన సూచనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ కేసు దర్యాప్తును సిట్ అధికారులు ముమ్మరం చేశారు. భగీరథ్ నుంచి స్వాధీనం చేసుకున్న ఐఫోన్‌ను, బాధితురాలి తల్లి కోర్టుకు సమర్పించిన ఆధారాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఖీూ)కు పంపాలని నిర్ణయించారు. కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు భగీరథ్‌ను 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పేట్ బషీరాబాద్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. మంగళవారం (మే 19) ఈ పిటిషన్ వేసే అవకాశం ఉంది. అరెస్టు, రిమాండ్ హడావుడిగా జరగడంతో కీలక వివరాలు సేకరించలేకపోయామని, కస్టడీలో విచారిస్తే మరిన్ని ఆధారాలు లభిస్తాయని పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలు పేర్కొన్న ప్రదేశాలకు నిందితుడిని తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కేసులో బాధితురాలి తల్లి ఫిర్యాదులో ప్రస్తావించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, మాజీ జర్నలిస్టు సంగప్పల నుంచి కూడా వాంగ్మూలాలు సేకరించే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాల సమాచారం.

# ఉస్మానియా యూనివర్సిటీ కీలక ప్రకటన.. డిగ్రీ పరీక్షల రీషెడ్యూల్

**బక్రీద్ పండుగ కారణంగా మే 28న ఓయూ పరీక్షలు రీషెడ్యూల్**
**పరీక్షలను రీషెడ్యూల్ చేస్తామని స్పష్టం చేసిన వైస్ ఛాన్సలర్**
**పరీక్షలు వాయిదా వేయాలని ప్రభుత్వానికి ఎంపీ ఒవైసీ విజ్ఞప్తి**
**త్వరలో కొత్త పరీక్షల తేదీలను ప్రకటించనున్న ఓయూ అధికారులు**
**తదుపరి అప్‌డేట్స్ కోసం అధికారిక వెబ్‌సైట్ చూడాలని సూచన**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పండుగను పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. మే 28వ తేదీన నిర్వహించ తలపెట్టిన పలు డిగ్రీ కోర్సుల పరీక్షలను రీషెడ్యూల్ చేయనున్నట్లు ప్రకటించింది. పండుగ తేదీపై స్పష్టత రావడంతో విద్యార్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయానికి ఒకరోజు ముందు ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. బక్రీద్ పండుగ రోజే బీఏ, బీకాం, బీఎస్సీ వంటి పలు ముఖ్యమైన పరీక్షలను షెడ్యూల్ చేశారని, దీనివల్ల ముస్లిం విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆయన తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. బీకాం 4వ, 6వ సెమిస్టర్, బీఎస్సీ ఆనర్స్, బీఎస్సీ బయోమెడికల్ సైన్స్ సహా పలు పరీక్షల జాబితాను ప్రస్తావిస్తూ, వాటిని అనువైన మరో తేదీకి మార్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఓవైసీ విజ్ఞప్తి, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగురాం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సెలవుల ప్రకారం మే 27న ఎలాంటి పరీక్షలు షెడ్యూల్ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ బక్రీద్ తేదీలో మార్పు ఉంటే, దానికి అనుగుణంగా మే 28న జరగాల్సిన పరీక్షలను రీషెడ్యూల్ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పరీక్షల తేదీలకు సంబంధించిన తదుపరి అప్‌డేట్స్ కోసం విద్యార్థులు ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్ (శీంఝఅఋ.ఖఏ.అఅ)ను గమనించాలని సూచించారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన ధుల్-హిజ్జాకు సంబంధించిన చంద్రుడు ఆదివారం (మే 17) కనిపించకపోవడంతో ఇస్లామిక్ పండితులతో కూడిన మూన్ సైటింగ్ కమిటీ మే 19ని ధుల్-హిజ్జా మొదటి రోజుగా ప్రకటించింది. దీని ప్రకారం, ధుల్-హిజ్జా 10వ రోజైన బక్రీద్ పండుగ మే 28న వస్తుందని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం కూడా తన అధికారిక సెలవుల జాబితాను సవరించి, మే 28ని బక్రీద్ పండుగకు సెలవుగా ప్రకటించనుంది. యూనివర్సిటీ త్వరలోనే వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలను ప్రకటించనుంది.

# నిధుల వాడకంలో నిలువుదోపిడి

మొదటి పేజీ తరువాయి

వ్యాపారస్తులు రాజకీయ నాయకుల అండతో ప్రజా సొమ్మును అధికారికంగా నిలువు దోపిడీకి పాల్పడుతుండడం ప్రభుత్వాలు ప్రజలపై చూపిస్తున్న ప్రత్యేక మోసమన్నారు. మరోవైపు ప్రజలకు ప్రభుత్వాలు ఏమాత్రం రక్షణ కల్పించలేదని చేతులెత్తేసినట్లుగా దేశ పాలన కొనసాగుతుండడంతో ప్రతి రాష్ట్రంలో ప్రజలకు ప్రజలు స్వతహాగా ఒక మతస్తులకు మరో మతస్తులకు మధ్య ఒక రాజకీయ వర్గానికి మరో రాజకీయ వర్గాలకు మధ్య ఒక పార్టీ కార్యకర్తలకు మరో పార్టీ కార్యకర్తలకు మధ్య విపరీతమైన దాడులు పెరిగిపోతున్నాయని ఒకరిపై ఒకరు మారణాయుధాలతో దాడులు చేసుకునే పరిస్థితి దేశవ్యాప్తంగా కొనసాగుతుందని వాటిని ఏమాత్రం నియంత్రించలేని దేశ ప్రధాని ప్రపంచ దేశాలు చుట్టేస్తూ భారతదేశ పాలనను గాలికి వదిలేసి అవినీతిపరులను అక్కున చేర్చుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. దేశం ఇంతలా నాశనమవుతున్నప్పటికిని నోరు మెదపని మేధావుల సంఖ్య కోట్లల్లో పెరిగిపోతుందని తీవ్రంగా దుయ్యపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యలు పట్టించుకునే పరిస్థితులు కనబడటం లేదని ప్రజలకు ప్రజలే వాళ్ల సమస్యలపై వాళ్లే పరిష్కారం మార్గాలను ఎంచుకుంటూ అంతర్లీనంగా మదన పడుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వాలు అధికారిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న ప్రభుత్వ నిధులను నిలుపుదల చేయాలని కోరారు. అధికారంలో ఉన్న పార్టీలైన అధికారంలో లేని పార్టీలైన రాజకీయ సమావేశాలకు గాని అధికారిక కార్యక్రమాలకు గాని పార్టీ సొంత నిధులను నాయకుల సొంత నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో ఆర్థిక సంక్షోభం విపరీతంగా పెరిగిపోయిందని దేశ ఆర్థిక పరిస్థితి 20 ఏళ్లు వెనుకబడిపోయిందని గుర్తు చేశారు. దేశాన్ని దోచుకున్నోలంతా నీతి మాటలు మాట్లాడుతూ దేశ ఆర్థికతను కాపాడుకోవాలని దేశ వనరులను సంరక్షించుకోవాలని మాట్లాడుతుండడం దేశ ప్రజలను ఇప్పటికే కావాల్సినంత మోసం చేసి మరో కొత్త రకమైన మోసపు మాటలను మాట్లాడుతున్నట్టుగా భావిస్తున్నామన్నారు. చాలా రాష్ట్రాల్లో అసమర్థత కలిగిన పాలకుల చేతుల్లో ప్రభుత్వాలు ఉంటుండగా ప్రభుత్వ నిధుల దుర్వినియోగం ఎక్కువగా జరుగుతుందని. అది కూడా ప్రభుత్వ అధికారిక కార్యాల ద్వారా మోసం జరుగుతుండడం విచారకరమన్నారు. చాలా రాష్ట్రాల్లో ప్రజలు చెల్లిస్తున్న పన్నుల రూపంలోని ఆర్థిక సొమ్ముకు లెక్కలు మాయం అవుతున్నాయని 2014 నుండి నేటి వరకు చాలా రాష్ట్రాల్లో అధికారిక లావాదేవీలతో కూడిన లెక్కల ఆధారాలు మాయం చేయబడ్డట్లుగా చరిత్ర ఆధారాలు ప్రస్ఫుటంగా వెల్లడిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రతి సందర్భంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను కనుమరుగు చేయబడడం వల్ల ప్రభుత్వ సొమ్ము ఎంత మేరకు దుర్వినియోగం జరిగిందనేది లెక్కల ఆధారాలు లేకుండా పోతున్నాయన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడుతున్న బడ్జెట్లో ఆధారంగా బడ్జెట్ రూపంలో ఖర్చు చేస్తున్న సొమ్ము అసెంబ్లీ సమావేశాల్లో లిఖించబడిన బుక్లెట్ ఆధారంగా పేపర్ రూపంలోనే ఖర్చు కనిపిస్తుంది తప్ప ప్రభుత్వ అధికారిక కార్యాలయాల్లో ఆర్థిక లావాదేవీలు ఎటువైపు మళ్ళించబడ్డాయన్నది హాజరు లేకుండా పోతుందన్నారు. పార్లమెంటు సమావేశాల్లో లక్షల కోట్ల రూపాయలు వార్షిక ఆర్థిక బడ్జెట్ గా ప్రవేశపెడుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రం నుండి లెక్కలేనంత సొమ్మును తీసుకుంటూ దేశాన్ని అభివృద్ధిపరిచే క్రమంలో అత్యంత విలువైన సొమ్మును దుర్వినియోగపరచిందని దేశ ప్రజలందరూ భావిస్తున్నారని తెలిపారు. అదే సందర్భంలో జాతీయ బిజెపి అకౌంట్లో పార్టీ వ్యక్తిగత అకౌంట్ లో పదివేల కోట్లకు పైన నిధులు సమకూర్చ పడడం బిజెపి పార్టీ వ్యక్తిగత అభివృద్ధిని పెంపొందించుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బిజెపి పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లుగా స్పష్టంగా వెల్లడవుతుందన్నారు. వాస్తవ విషయాలు ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వ అధికారిక సుమను ఏ ప్రభుత్వమైనా దుర్వినియోగపరచడం అనేది నేరం లాంటిదని భారత దేశంలో చాలా రాష్ట్రాలు ప్రభుత్వ సొమ్మును ప్రజాధనాన్ని అధికారికంగా లాంఛనంగా దుర్వినియోగాలకు పాల్పడుతున్నారని అలాంటి సందర్భాలు అత్యున్నత న్యాయస్థానాన్ని కేసుల రూపంలో ఆశ్రయిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రజాధనాన్ని పొదుపు చేయడంతో పాటు ప్రజల సొమ్మును ప్రజల అభివృద్ధి కోసం మాత్రమే ఖర్చు చేసే విధంగా ప్రతి రాష్ట్రంలోని ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రజలు ప్రభుత్వాల నుండి పెద్దగా ఆశించింది ఏమి లేకపోయినప్పటికిని ప్రజల పేరు చెప్పి ప్రజా సంక్షేమ పథకాల అభివృద్ధి పేరు మీద ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు మాత్రం విపరీతంగా దుర్వినియోగ పాలవుతుందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంలో ప్రభుత్వాలు చూపిస్తున్న శ్రద్ధ ప్రభుత్వం చేస్తున్న ఖర్చుల్లో కూడా చూపిస్తూ ప్రజల మేలుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం దేశంలోని ప్రతి ఒక్కరిని అప్పుల పాలు చేసిందని ఇలాంటి స్థితిని అధిగమించడం కోసం దేశ భవిష్యత్తును కాపాడడం కోసం ప్రభుత్వాలు ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేస్తున్న విధానంలోని స్వయంకృతాపరాధాలను పసిగట్టి దేశాన్ని కాపాడుకోవాలని తెలిపారు. సమాజం హితం కోరే ప్రతి నేత ప్రజా సొమ్మును దుర్వినియోగపర్చకుండా సొంతంగా సంపాదించుకుంటున్న సొమ్మును ప్రజాసేవ కోసం ఖర్చుచేస్తూ ఓట్లేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటారని అలాంటి నేతలను దేశవ్యాప్తంగా అభివృద్ధి పరచుకోవాల్సిన అవసరం ప్రస్తుత భారతదేశానికి ఎంతో అవసరమన్నారు. మానవత్వపు విలువలను దిగజార్చుకుంటూ దేశ ఆర్థిక స్తోమతను దెబ్బతీస్తున్న ప్రతి నేతపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సొమ్మును ప్రజలకు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వాలు ఇంతలా మోసపూరితమైన పనులు చేస్తుంటే ప్రజల అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందన్నారు. ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వాలను పతనం చేసే అంతవరకు ప్రజా పోరాటాలు ఆదర్శంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

# క్రైస్తవ పాస్టర్‌పై కరుడుగట్టిన దాడి







**తీవ్రమైన రక్తం మడుగులో పాస్టర్ అభినయ్ దర్శన్**
**గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రమైన దాడి పాల్పడినట్లు సమాచారం**
**స్థానికులు ప్రభుత్వ వైద్య ఆసుపత్రికి చేర్చారు**
**పాస్టర్ అభినయ్ దర్శన్ శరీరంపై తీవ్రమైన గాయాలు**
**పాస్టర్‌తో పాటు ఇతరులపై దాడి చేసిన దుండగులు**
**ఆంధ్రాలో పాస్టర్లపై పెరుగుతున్న ప్రభుత్వ కుట్రలు**

ఆంధ్రప్రదేశ్ (జై భీమ్ న్యూస్)

ఆంధ్రాలో మరో పాస్టర్ అభినయ్ దర్శన్ పై దుండగులు దాడికి పాల్పడినట్లు సమాచారం. పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య తదనంతరం క్రైస్తవ సమాజానికి అండగా నిలుస్తున్న యువ పాస్టర్ అభినయ్ దర్శన్ ను హతమార్చడానికి కిరాతక గుండాలు తీవ్రంగా ప్రయత్నం చేసి కొట్టి చంపాలని చూసిన విధానం వెలుగు చూస్తుంది. రక్తం మడుగులో పడి ఉన్న పాస్టర్ అభినయ్ దర్శన్ గుర్తించిన స్థానికులు వైద్య చికిత్స నిమిత్తం దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. వివరాలను పరిశీలించగా పాస్టర్ అభినయ్ దర్శన్‌పై దాడి యత్నం కలకలం... తీవ్ర గాయాలతో రోడ్డుపక్కన పడి ఉన్న వీడియోలు వైరల్" పాస్టర్ అభినయ్ దర్శన్‌పై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో కనిపిస్తోంది. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ చింతపల్లి మండలంలో దాడి జరిగినట్లు నీరుతోటపాలెం ప్రాంతంలో సంఘటన జరగగా ప్రస్తుతం ఆయన్ను వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడం జరిగింది. దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# పేద విద్యార్థులను ఆదుకుందాం





**పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలి.**
**పేద విద్యార్థులకు బుక్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది.**
**అన్ని దానాల్లో కన్న విద్యా దానం గొప్పది.**
**పేదలకు చేసే సేవలను ఆస్వాదిస్తేనే మహోన్నత విలువలు తెలుస్తాయి.**
**అడుగడుగునా పేద విద్యార్థుల ఆశయాలకు బాసటగా నిలుద్దాం.**
**విద్యా దానం మహా దానం పేద పిల్లల విద్యకు సహాయం చేయండి -డాక్టర్ అనితా రెడ్డి**

హన్మకొండ జై భీమ్మ్ న్యూస్:-

పేద విద్యార్థులకు చేసే సేవ చిరకాలం నిలిచిపోతుందని అనురాగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ అనిత రెడ్డి అన్నారు. పేద విద్యార్థులకు సేవ చేయాలని ప్రతి ఒక్కరూ పరితపించి పోవాలని సూచించారు. మనం చేస్తున్న సేవలు చిన్నవా.... పెద్దవా... అనేది కాకుండా విద్యార్థుల అవసరాలను బట్టి వాళ్లకు ఎంత మేరకు సహాయపడగలుగుతున్నామనేది ప్రధానమన్నారు. పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో వాళ్ల లక్ష్యాలను సాధించేవరకు సమయాను కూలంగా సహాయపడుతూనే ఉండాలన్నారు. సమాజంలో పెరిగిపోతున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సొసైటీల రూపంలోనే కాకుండా మృదుమనస్సు కలిగిన ప్రతి ఒక్కరు పేద విద్యార్థులకు చేయూతనివ్వడానికి ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమం వివరాలు పరిశీలించగా సోమవారం అనురాగ్ సొసైటీ, వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన వరంగల్ రైల్వే స్టేషను దగ్గరలోని డాన్ బాస్కో వీధి బాలల ఆశ్రమం లోని అనాధ, సెమి ఆర్ఫన్ పిల్లలకు, వీధి బాలల పిల్లలకు నోట్ బుక్స్, పండ్లు, చాక్లెట్లు ఉచితంగా అందించడం జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ పేదరికము ఎప్పుడు విద్యకు ఆటంకము కారాదని భావించి పేద పిల్లలకు విద్యకు సహకరించాలని ఈ కార్యక్రమం నిర్వహించామని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు గత 30 సంవత్సరాలుగా ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడమే కాక ఫీజులు సైతం కడుతున్నామని విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని అన్నారు, విద్యా దానం మహా దానం అని ప్రతి ఒక్కరూ పేద పిల్లలకు తోచిన మేర సహాయము చేయాలని అన్నారు, పిల్లలకు విద్య తోపాటు మంచి నడవడిక అవసరం అని, ప్రణాళిక బద్ధంగా క్రమశిక్షణతో లక్షసాధణ చేసి విజయం సాధించాలని, విద్యని కష్టంగా కాక ఇష్టంగా చదవాలని, విద్య విజ్ఞజణాన్నే కాక ఆర్థికంగా మెరుగుపరచి ఉన్నత శిఖరాలు చేరుస్తుందని పిల్లలకు చదువు విలువ తెలియ చేసారు, బడి వయస్సు పిల్లలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి, సంతోష్ కుమార్, శారద, టీచర్స్, విద్యార్దులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ అనితా రెడ్డి వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్.

# నీట్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్**
**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : ఏ ఐ ఏఫ్ డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున , రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి**




**హైదరాబాద్ /బాగ్ లింగంపల్లి ఓంకార్ భవన్ (ఏ ఐ ఫ్ డి స్ కార్యాలయం) 18-మే-2026 (జై భీమ్ న్యూస్)**

దేశవ్యాప్తంగా 22లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నీట్ పరీక్షా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, పేపర్ లీకేజీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. (ఏ ఐ ఏఫ్ డి ఎస్) అఖిల భారత ప్రజాతంత విద్యార్థి సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం ఓంకార్ భవన్ బాగ్ లింగం పల్లి లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏ ఐ ఏఫ్ డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ, పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల ఆశయాలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని మండిపడ్డారు. నీట్ పరీక్షలు ప్రతి సంవత్సరం అవినీతి, పేపర్ లీకేజీలు, అక్రమాలతో వార్తల్లో నిలుస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మరియు న్ టీ ఏ ఎలాంటి సంస్కరణలు తీసుకు రాకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, మరోవైపు పేపర్ లీకేజీ మాఫియా కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఉన్న పెద్దల్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందుకే అసలు నిందితులు బయటకు రావడం లేదని విమర్శించారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో ఆటలాడే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని, వెంటనే న్ టీ ఏ ను రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, లేకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు.అలాగే నీట్ పేపర్ లీకేజీ వెనుక ఉన్న మాఫియాను పూర్తిగా వెలికితీసి, వారికి కఠిన శిక్షలు విధించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. “నీట్ లీకేజీకి బాధ్యులు ఎవరు? బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలి!” “ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి!” “న్ టీ ఏ రద్దు చేయాలి!” “విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు ఆపాలి!” “పేపర్ లీకేజీ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి!” ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి , అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసు వారి స్పెషల్ డ్రైవ్







**వరంగల్ 18-మే-2016 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పట్టణం లోని కాజీపేట, హనుమకొండ మరియు వరంగల్ ట్రాఫిక్ పి.ఎస్.ల పరధులలో తేదీ 17.05.2026 నాడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా మొత్తం (81) ఎనభై ఒకటి డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు (06) ఆరుగురు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై కేసులు పెట్టగా, అందులో (75) మందికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో కౌన్సెల్లింగ్ శ్రీ టి, సత్యనారాయణ ఏసీపీ వరంగల్ ట్రాఫిక్ మరియు శ్రీ పి. వెంకన్న, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గారు ఇచ్చినారు. వారిని సంభందిత మేజిస్ట్రేట్ గారి ముందు హాజరు పరచగా, సంభందిత మేజిస్ట్రేట్ గారు (89) ఎనభై తొమ్మిది మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వ్యక్తులకు రు. 1,12,300/- లు, (17) పదిహేడు మంది డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి రు. 10,800/- లు ఫైన్ విధించారు.

**ట్రాఫిక్ పోలీసు వారి హెచ్చరిక: టి సత్యనారాయణ ఏసీపీ వరంగల్ ట్రాఫిక్**

వరంగల్ పట్టణం లోన ఇకపై ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహానాలు నిడిపిన, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా తమ వాహనాలు నడిపినా, మైనర్లులకు తమ వాహనాలు ఇచ్చిన ఇకపై చట్ట రీత్యా కటినమైన చర్యలు తీసుకుంటామని శ్రీ టి, సత్యనారాయణ ఏసీపీ వరంగల్ ట్రాఫిక్ గారు హెచ్చరించారు.

# జర్నలిస్టు సమస్యలకై పోరాటం





**మీడియా పాయింట్ అధ్యక్షుడిగా ఎలుకరాజు సదానందం ఎన్నిక**
**హసన్‌పర్తి మీడియా పాయింట్ నూతన కమిటీ ఎన్నిక**

**హన్మకొండ జిల్లా/హసన్‌పర్తి, మే 18 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలోని జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం మరియు సమస్యల పరిష్కార లక్ష్యంగా హసన్‌పర్తి మీడియా పాయింట్ నూతన కమిటీని ఆదివారం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్నారు. స్థానిక ఎంఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన ఈ సమావేశానికి హసన్‌పర్తి మండలంలోని వివిధ పత్రికలు, టీవీ ఛానెల్లు, డిజిటల్ మీడియా సంస్థలకు చెందిన విలేకరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ అబ్జర్వర్‌గా వ్యవహరించిన వరంగల్ ప్రెస్ క్లబ్ ఈసీ సభ్యుడు కందుకూరి సంజీవ్ పర్యవేక్షించారు. సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రజాస్వామ్యబద్ధంగా ఓటింగ్ విధానంలో కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టుల మధ్య పరస్పర సహకారం, వృత్తిపరమైన విలువలు, ఐక్యతను పెంపొందించే దిశగా మీడియా పాయింట్ పనిచేయాలని సూచించారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా ఎలుకరాజు సదానందం (వార్త) ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా గరిగే శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా గోలే రవీందర్, కోశాధికారిగా దాడి చిరంజీవి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాజ్‌కుమార్, దాడి బిక్షపతితో పాటు మరో ఐదుగురిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎలుకరాజు సదానందం మాట్లాడుతూ హసన్‌పర్తి మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి కమిటీ తరఫున కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఐక్యత కోసం ప్రతి సభ్యుడు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా రంగంలో పనిచేస్తున్న ప్రతి విలేకరికి అండగా నిలుస్తామని, అవసరమైన సందర్భాల్లో పోరాటపథాన్ని కూడా అవలంబిస్తామని స్పష్టం చేశారు. అలాగే జర్నలిస్టుల వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు, యువ విలేకరులకు మార్గదర్శకత్వం అందించేందుకు, మీడియా రంగంలో సానుకూల వాతావరణం నెలకొల్పేందుకు మీడియా పాయింట్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. మండలంలోని జర్నలిస్టుల మధ్య స్నేహభావం, పరస్పర సహకారం మరింత బలపడేలా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్, దండుగూడం రాజ్‌కుమార్, గడ్డం సంపత్, కనుకుంట్ల సతీష్, నద్దునూరి బాబు, అనిల్ కాందారి, జక్కుల విజయ్, తాళ్లపెల్లి స్వామి కుమార్, దయాకర్, దుర్గాప్రసాద్, అమిరిశెట్టి సత్యం, కె. శ్రీకాంత్, కుమార్, సింగరవేణి బాబు, ఆర్. దయాకర్, తంగెల్లపల్లి సాంబమూర్తి, సందెల రాజు, బి. రాజు తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

## ఏపీలో ‘ఎస్ఐఆర్’.. అలర్ట్ గా ఉండాలంటూ పార్టీ శ్రేణులకు సజ్జల ఆదేశం

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నేపథ్యంలో వైసీపీ తన క్యాడర్‌ను ఈ కార్యక్రమం కోసం సిద్ధం చేస్తోంది. పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ పరిశీలకులతో నిర్వహించిన కీలక సమావేశంలో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఓటర్ల సవరణ ప్రక్రియ జూన్ 15న ప్రారంభమై సెప్టెంబర్ వరకు అత్యంత కీలకమైన దశల వారీగా సాగనుందని ఆయన వివరించారు. సజ్జల వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం, జూన్ 15 నుంచి జూలై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. అనంతరం జూలై 21న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుంది. ఆ తర్వాత ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియను పూర్తి చేసి, చివరగా సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, పార్టీ తరఫున నియమించిన కమిటీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.

## న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీని నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం: ఢిల్లీలో మంత్రి లోకేష్

**ఢిల్లీలో ‘యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా” సదస్సు హాజరైన ఏపీ మంత్రి నారా లోకేష్**
**పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం**
**విశాఖను ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక**
**డేటా సెంటర్ల చుట్టూ పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్ నిర్మాణం**
**అమెరికా-భారత్ అణుశక్తి సహకారంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందన్న లోకేష్**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

భవిష్యత్ అణు ఇంధన (న్యూక్లియర్ ఎనర్జీ) ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన ప్రపంచ భాగస్వామిగా నిలబెట్టడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఇది అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఈఐ), యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం (యూఎస్ఐఎస్‌పీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన “యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా” సదస్సులో లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, “ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలైన స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరి తరం రియాక్టర్ సిస్టమ్స్‌కు విస్తృత అవకాశాలున్నాయి. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీ రంగంలో నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన ఉత్పత్తి వంటివి కలిసొచ్చే అంశాలు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక మౌలిక వసతులు, పోర్టులు, లాజిస్టిక్స్, వేగవంతమైన అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది భారతదేశానికి, ఏపీకి ఒక చరిత్రాత్మక అవకాశం” అని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సువిశాల తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్టాత్మక పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ వంటివి అదనపు ప్రయోజనాలని తెలిపారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని, ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. ప్రపంచ దేశాలు ఆర్థికవృద్ధి, పారిశ్రామిక వ్యాప్తి, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటివి ఏకకాలంలో ఎలా సాధించాలని ఆలోచిస్తున్నాయని లోకేష్ అన్నారు. వాతావరణ మార్పులపై ఇచ్చిన హామీలను పాటిస్తూ, ఏఐ యుగానికి అవసరమైన విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో, సురక్షితంగా ఎలా అందించాలన్నది పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. “ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఇంధన భద్రత (ఎనర్జీ సెక్యూరిటీ) మాకు అత్యంత ప్రాధాన్య అంశం. నేడు ఏపీ దేశంలోనే కీలకమైన పారిశ్రామిక, డిజిటల్ కేంద్రంగా మారుతోంది,” అని లోకేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నామని, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతున్నామని లోకేష్ తెలిపారు. విశాఖపట్నాన్ని ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, అక్కడ 6 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు రాబోతున్నాయని వెల్లడించారు. భవిష్యత్ పరిశ్రమలకు భారీ పరిమాణంలో, 24/7 నిరంతరాయంగా, కాలుష్యరహిత, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ అవసరమని, అందుకే ఇంధన ప్రణాళిక ఆర్థిక ప్రణాళికలో కీలకంగా మారిందని వివరించారు. “మా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రెన్యూవబుల్స్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, గ్రిడ్ ఆధునీకరణ వంటి రంగాల్లో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నాం,” అని ఆయన ప్రకటించారు. భవిష్యత్ పారిశ్రామిక వృద్ధికి కేవలం పునరుత్పాదక శక్తి సరిపోదని తాము వాస్తవికంగా ఆలోచిస్తున్నామని లోకేష్ అన్నారు. ఏఐ కంప్యూటింగ్ విస్తరిస్తున్న కొద్దీ విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని, ఒక హైపర్‌స్కేల్ ఏఐ-నేటివ్ డేటా సెంటర్ ఒక మధ్యస్థ పట్టణానికి సమానమైన విద్యుత్‌ను వినియోగిస్తుందని ఉదహరించారు. గ్లోబల్ కంపెనీలు విశాఖలో గిగావాట్ సామర్థ్యంగల ఏఐ-నేటివ్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని, వీటికి భారీ విద్యుత్ అవసరమవుతుందని తెలిపారు. తమ దృష్టిలో డేటా సెంటర్ అంటే కేవలం సర్వర్లతో కూడిన భవనాలకు ఆతిథ్యమివ్వడం కాదని, దాని చుట్టూ ఒక పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. కూలింగ్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాటరీ స్టోరేజ్ వంటి వాటిని స్థానికంగా తయారు చేయడాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఏఐ టెక్నీషియన్లు, ఎనర్జీ ఇంజనీర్ల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి సంస్థలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. న్యూక్లియర్ ఎనర్జీని కూడా ఒక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థగా చూడాలని లోకేష్ అభిప్రాయపడ్డారు. కేవలం విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, పూర్తి న్యూక్లియర్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడమే ఏపీకి దీర్ఘకాలిక అవకాశమని అన్నారు. కీలక విడిభాగాలు తయారు చేయడం, అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలు నిర్మించడం, ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు నెలకొల్పడం, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం వంటి వాటిపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. న్యూక్లియర్ ప్రాజెక్టులకు బదులుగా న్యూక్లియర్ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి ఇదే సరైన సమయమని లోకేష్ పేర్కొన్నారు. అణుశక్తి విశ్వసనీయ బేస్‌లోడ్ విద్యుత్‌ను అందిస్తుందని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, దీర్ఘకాలంలో పోటీ ధరలకు విద్యుత్‌ను అందిస్తుందని వివరించారు. ఆధునిక న్యూక్లియర్ టెక్నాలజీల వల్ల భద్రతా ప్రమాణాలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయని గుర్తుచేశారు. ఏఐ విప్లవం వల్ల ఇంధనానికి డిమాండ్ పెరిగిందని, దీనివల్ల న్యూక్లియర్ ఎనర్జీ ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని లోకేష్ అన్నారు. “ఏఐ భవిష్యత్తు ఇంధన భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో నమ్మకమైన, స్వచ్ఛమైన బేస్‌లోడ్ విద్యుత్ తప్పనిసరి. ఇది ప్రభుత్వాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, పెట్టుబడిదారుల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలు సృష్టిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఆ భవిష్యత్తులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటోంది,” అని ఆయన తెలిపారు. భారత్-అమెరికా సహకారం ఇప్పటికే టెక్నాలజీ, రక్షణ, సెమీకండక్టర్లు వంటి రంగాల్లో మార్పులు తెచ్చిందని, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో తదుపరి ప్రధాన అధ్యాయం అణుశక్తి రంగమే కాగలదని లోకేష్ బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# బక్రీద్ పండుగను సామరస్య వాతావరణంలో నిర్వహించాలి




**కలెక్టర్లతో కలిసి అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించిన పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**హన్మకొండ, 18 మే 2026( జై భీమ్ న్యూస్)**

రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఐడీఓసీలో చాహత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్య శారదలతో కలిసి అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బక్రీద్ పండుగ సందర్భంగా చేపట్టాల్సిన శాంతిభద్రతల చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, ఈద్గాల వద్ద ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. పండుగ సందర్భంగా మసీదులు, ప్రార్థనా స్థలాలు, ఈద్గాల పరిసరాల్లో అవసరమైన అన్ని సదుపాయాలను ముందస్తుగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ నగరాలు సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని, అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవ భావాలతో పండుగలను జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. అదే స్ఫూర్తితో బక్రీద్ పండుగను కూడా ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ప్రతి మతానికి సంబంధించిన భావోద్వేగాలను గౌరవించడం పోలీసు శాఖ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే సందేశాలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. జంతువులకు పశుసంవర్ధక శాఖ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పశువుల వ్యర్థాలను రోడ్లపై వేయకుండా పరిశుభ్రత పాటించాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బల్దియా ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ బలికి ఉపయోగించే పశువులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు త్వరితగతిన జారీ చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. ఎవరూ మనోభావాలు దెబ్బతినకుండా పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు, పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అఫ్జల్ బియాబాని ఖుస్రో పాషా, డీసీపీలు అంకిత్ కుమార్, ధారా కవిత, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, ఏసీపీలు, ఆర్టీవోలు, సంబంధిత శాఖల అధికారులు, శాంతి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్ధిఖీ, సభ్యులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన వరంగల్ సీపీ

**పోలీస్ వాహనాల మరమ్మత్తుల కోసం నూతన యంత్రాల ప్రారంభం**




**వరంగల్, మే 2026( జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీ) విభాగంలో పోలీస్ వాహనాల మరమ్మత్తుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన భారీ హైడ్రాలిక్ యంత్రంతో పాటు వాహన టైర్లను తొలగించి, అమర్చేందుకు ఉపయోగించే ప్రత్యేక యంత్రాన్ని సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులతో కలిసి యంత్రాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనాల మరమ్మత్తు ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ఆధునిక యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ఇప్పటివరకు పోలీస్ వాహనాల మరమ్మత్తుల కోసం ప్రైవేట్ రిపేర్ సెంటర్లపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇప్పుడు ఎంటీ విభాగంలోనే ఆధునిక యంత్రాల ద్వారా మరమ్మత్తులు నిర్వహించడం వల్ల సమయంతో పాటు వ్యయాన్ని కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. పోలీస్ శాఖకు చెందిన వాహనాలను సమర్థంగా నిర్వహించేందుకు ఈ చర్యలు దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీస్ వాహనాలను వినియోగించే అధికారులు, సిబ్బంది వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వాహనాలను సకాలంలో తనిఖీ చేయడం, చిన్నపాటి లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించడం ద్వారా పెద్ద మరమ్మత్తుల అవసరం తగ్గుతుందని తెలిపారు. పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించడం ద్వారా ప్రజా ధనాన్ని ఆదా చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, ధారా కవిత, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, రవి, ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, అంతయ్య, సురేంద్ర, జితేందర్ రెడ్డి, సత్యనారాయణ, జాన్ నర్సింహులు, ఆర్‌ఐలు శ్రీధర్, స్పర్జన్ రాజ్, సతీష్, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితర అధికారులు, ఎంటీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలకు ఎఐసిటిఈ గుర్తింపు

**బోధనా, బోధనేతర సిబ్బందిని అభినందించిన వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**



**హన్మకొండ, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల (కో-ఎడ్యుకేషన్)కు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూ ఢిల్లీ నుండి అధికారిక గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ తెలిపారు. ఈ మేరకు ఎఐసిటిఈ నుండి అధికారిక ఉత్తర్వులు కళాశాలకు అందినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గుర్తింపు ద్వారా కళాశాలలో అందిస్తున్న సాంకేతిక విద్యా ప్రమాణాలకు మరింత గుర్తింపు లభించినట్లయిందని అన్నారు. ఈ సందర్భంగా ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి కళాశాల బోధనా, బోధనేతర సిబ్బందిని అభినందించారు. కళాశాల అభివృద్ధి, నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో అధ్యాపకులు, సిబ్బంది సమిష్టి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించే దిశగా కళాశాల మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విద్యా ప్రమాణాలను సాధించేలా కృషి కొనసాగించాలని సూచించారు. కళాశాలకు ఎఐసిటిఈ గుర్తింపు రావడం పట్ల అధ్యాపకులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

## నీట్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి ఏఐఎఫ్‌డీఎస్ డిమాండ్**




**హైద్రాబాద్, 18 మే 2026 (జై భీమ్ న్యూస్)**

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నీట్ పరీక్షా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, పేపర్ లీకేజీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బాగ్ లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో నిర్వహించిన ఏఐఎఫ్‌డీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థను ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశయాలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు. ప్రతి సంవత్సరం నీట్ పరీక్షలు అవినీతి, పేపర్ లీకేజీలు, అక్రమాలతో వార్తల్లో నిలుస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మరియు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, మరోవైపు పేపర్ లీకేజీ మాఫియా కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తోందని ఆరోపించారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో ఆటలాడే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని పేర్కొంటూ, వెంటనే ఎన్.టి.ఎను రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వెనుక ఉన్న మాఫియాను పూర్తిగా వెలికితీసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**



**వరంగల్, 18 మే 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రతి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో భాగంగా కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను పోలీస్ కమిషనర్‌కు నేరుగా వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విన్న పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించినప్పుడు పోలీసులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని సీపీ పేర్కొన్నారు. ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 10 ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులలో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య వివాదాలు, కేసుల పురోగతి, భూ సమస్యలు తదితర అంశాలు ఉన్నాయని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే కమిషనరేట్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు 8712685257 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు.

# బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక మలుపు.. జీవితఖైదు పడే సెక్షన్ నమోదు

**పోక్సో కేసులో బండి భగీరథ్‌పై మరో కఠిన సెక్షన్ నమోదు**
**బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం జరిగిందన్న ఆరోపణలు**
**ప్రత్యేక అధికారిగా డీసీపీ రితిరాజ్ దర్యాప్తుతో కీలక మలుపు**
**నేరం రుజువైతే పదేళ్ల నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష పడే అవకాశం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సంచలనం సృష్టించిన పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై దర్యాప్తు అధికారులు కేసును మరింత తీవ్రతరం చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 64(2)(వీ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే నిందితుడికి పదేళ్లకు పైగా జైలు శిక్ష, కొన్ని సందర్భాల్లో జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉంది. ఈ నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పుడు, కేసు నమోదు విషయంలో పోలీసులు హైడ్రామా సృష్టించారని, బలహీనమైన సెక్షన్లు నమోదు చేశారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితురాలి నుంచి వాంగ్మూలం తీసుకునే క్రమంలో పోలీసులు నిజం చెప్పకుండా ఒత్తిడి చేశారన్న విమర్శలు రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ఈ కేసుకు ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే రంగంలోకి దిగిన డీసీపీ రితిరాజ్, సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు ఫైళ్లను పరిశీలించారు. పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలంలో స్పష్టత లేదని గుర్తించి, దర్యాప్తును లోతుగా చేపట్టారు. మంగళవారం డీసీపీ స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి, ఆమెతో స్నేహపూర్వక వాతావరణంలో మాట్లాడారు. పోక్సో కేసుల దర్యాప్తు నిబంధనల ప్రకారం, ఆమె నుంచి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. బాధితురాలు చెప్పిన విషయాలకు, పోలీసులు మొదట నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేదని గ్రహించారు. బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడి జరిగిందని ఆమె వాంగ్మూలం ద్వారా తెలియడంతో ఇది అత్యంత తీవ్రమైన నేరమని డీసీపీ నిర్ధారించుకున్నారు. బాధితురాలి ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6 పరిధిలోకి వస్తాయని గుర్తించారు. దీనికి సమానమైన బీఎన్ఎస్ సెక్షన్ 64(2)(వీ)ను కేసులో చేర్చాలని ఆదేశించారు. ఈ సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే నిందితుడికి కనిష్ఠంగా 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, గరిష్ఠంగా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంటుంది. డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.

# జనగణనలో సమగ్ర వివరాలను నమోదు చేయాలి

**ప్రతి కుటుంబ వాస్తవ వివరాలను నమోదు చేయాలి**
**రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి**
**జనగణన డేటా అద్దంలా ఉండాలి**



**హన్మకొండ, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

జనగణన ప్రక్రియలో ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలు, వాస్తవ పరిస్థితులను ఖచ్చితంగా నమోదు చేయాలని భారతి హోళికేరి అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాలసీలు, అభివృద్ధి ప్రణాళికలు, రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వంటి కీలక అంశాలకు జనగణన డేటా ఆధారమవుతుందని ఆమె పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జరుగుతున్న జనగణన పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చాహత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్లు, డీఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జరుగుతున్న జనగణన పురోగతిని చార్జ్ అధికారులుగా ఉన్న తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీలు, అర్బన్ ప్రాంతాల్లో వంద శాతం డేటా సేకరణ జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. భారతి హోళికేరి మాట్లాడుతూ జనగణన ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జరిగే అత్యంత కీలక ప్రక్రియ అని, ఒకసారి నమోదు చేసే డేటా దశాబ్దాల పాటు ప్రభుత్వ విధానాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. "సెన్సెస్ ఈజ్ ది మదర్ ఆఫ్ ఆల్ సర్వేస్" అని పేర్కొంటూ జనగణనలో నమోదయ్యే డేటా అద్దంలా ఉండాలని, క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించాలని అన్నారు. ప్రతి ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్య, మౌలిక వసతులు, నివాస గృహాల వివరాలు తదితర అంశాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఎక్కడా నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు జనగణనను సీరియస్‌గా తీసుకోవాలని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియ ప్రస్తుతం ఆధునిక సాంకేతికత ఆధారంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేస్తూ డేటా నమోదు జరుగుతోందని తెలిపారు. హెచ్ఎల్‌బీ (హౌస్ లిస్టింగ్ బ్లాక్)ల వారీగా మానిటరింగ్ అత్యంత కీలకమని, పోర్టల్‌లో నమోదైన వివరాలను చార్జ్ అధికారులు పరిశీలించాలని సూచించారు. జూన్ 19 చివరి గడువు అని పేర్కొంటూ ఫేజ్-1, ఫేజ్-2లలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు డేటా సేకరణ చేపడతారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఎన్యుమరేటర్ల స్థానంలో రిజర్వ్ సిబ్బందిని వినియోగించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అర్బన్ ప్రాంతాల్లో జనగణన నిర్వహణలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఒక్క ఇంటి వివరాలు కూడా మిస్ కాకుండా నమోదు చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి జనగణన కావడంతో సమగ్ర డేటా నమోదు చేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో 14 మండలాలు ఉండగా, అందులో రెండు పూర్తిగా అర్బన్ ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించినట్లు చెప్పారు. హెచ్ఎల్‌బీల వారీగా జనగణన ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందన్నారు. అలాగే డాక్టర్ సత్య శారద వరంగల్ జిల్లాలో జరుగుతున్న జనగణన ప్రక్రియ, ఎన్యుమరేటర్ల సంఖ్య, పురోగతి తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, విజయలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, గణాంక అధికారి రామ్ దయాకర్ రెడ్డి తదితర అధికారులు, రెండు జిల్లాలకు చెందిన తహసీల్దార్లు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి

**10 మంది అరెస్ట్ - రూ.1.91 లక్షల నగదు స్వాధీనం**




**హన్మకొండ, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1,91,150 నగదు, 10 మొబైల్ ఫోన్లు, పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహణపై టాస్క్‌ఫోర్స్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హనుమకొండలోని ఇందిరానగర్ ప్రాంతంలో కొక్కిరాల రవీందర్ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు గుర్తించి పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో అక్కడ పేకాటలో పాల్గొంటున్న 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లు, పేకాట సామగ్రితో పాటు నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం సుబేదారి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో వ్యాపారులు, వ్యవసాయదారులు వివిధ ప్రాంతాలకు చెందినవారు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. హనుమకొండ, జనగామ, హుజూరాబాద్, హసన్‌పర్తి, గోపాల్పూర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు పేకాటలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌ను ఏసీపీ ఎ. మధుసూధన్ పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ జి. బాబులాల్, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్, ఎస్ఐ బి. ఉప్పలయ్య, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేకాట, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# రౌడీషీటర్లపై పోలీసుల ప్రత్యేక చర్య

**రోడ్డుపై నడిపిస్తూ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి బైండోవర్ చేసిన మిల్స్ కాలనీ పోలీసులు**



**వరంగల్, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలువురు రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్ నుంచి ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుపై నడిపిస్తూ తీసుకెళ్లి బైండోవర్ చేశారు. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చర్యల్లో రౌడీషీటర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, ఇక్బాల్ సమక్షంలో బైండోవర్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు రౌడీషీటర్లకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు, నేరాల నియంత్రణ కోసం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహణ

**దేశభక్తి, సామరస్య సందేశాలతో ఆకట్టుకున్న కార్యక్రమం**

**హైద్రాబాద్, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

లాలాపేటలో శనివారం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి హిందూ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీసర సాయిదత్తా పీఠం పీఠాధిపతులు స్వామి రామానంద ప్రభూజీ హాజరై ఆధ్యాత్మిక సందేశం అందించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్ కస్తూరి రాకా సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, దేశభక్తి, సాంస్కృతిక విలువలను కాపాడాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత మహిళా కన్వీనర్ రుక్మిణి మాట్లాడుతూ "గడప లోపలే హిందువులు.. గడప దాటితే అందరూ బంధువులే" అనే సందేశాన్ని ప్రజలకు అందించారు. సమాజంలో పరస్పర గౌరవ భావాలు, సామరస్య వాతావరణం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రతిభారాజ్ గౌడ్ నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారతమాత పూజ, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు సాల్వేరు కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పార్వతీ పరమేశ్వర్, ఉపాధ్యక్షుడు పంచముఖి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు కూరెల్లి కిరణ్ గౌడ్, గోపాలచారి, కుమార్ షాను, భాస్కర్, శ్రీనివాస్, రమేష్, రామ్ చరణ్, ప్రభాకర్, విశాల్ శర్మ, విశాల్, శ్రీనాథ్, పుష్ప, సునీత, వెంకట్రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రకృతి విపత్తులపై అప్రమత్తత

**వరంగల్‌లో ఉత్కంఠ రేపిన రెడ్ అలెర్ట్ మాక్ డ్రిల్**
**చెరువులో చిక్కుకున్న వారిని క్షణాల్లో రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు**

**వరంగల్, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో శాఖలు ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పించేందుకు వరంగల్ నగరంలో సోమవారం నిర్వహించిన రెడ్ అలెర్ట్ మాక్ డ్రిల్ ఉత్కంఠభరితంగా సాగింది. నిజంగా వరద విపత్తు సంభవించినట్టుగా అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక చర్యలు ప్రజలను ఆకట్టుకున్నాయి. మధ్య కోట గుండు చెరువు ప్రాంతంలోని యాదవవాడలో రెడ్ అలెర్ట్ ప్రకటించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రజల్లో విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌లో పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక శాఖలతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేశాయి. ప్రమాద సమయంలో క్షణం ఆలస్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందనే విషయాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ ప్రజల్లో అప్రమత్తత పెంచే ప్రయత్నం చేశారు. వరంగల్ ఏకశిలా పార్క్ చెరువులో ఇద్దరు వ్యక్తులు నీటిలో కొట్టుకుపోతుండగా, మరో ఇద్దరు చెరువు మధ్యలోని బండరాళ్లపై చిక్కుకుని సహాయం కోసం అరుస్తున్న దృశ్యాలను సృష్టించారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే బోట్లతో చెరువులోకి దూసుకెళ్లి బాధితులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. ఈ సహాయక చర్యలను ప్రత్యక్షంగా వీక్షించిన ప్రజలు కాసేపు ఇది మాక్ డ్రిల్ అన్న విషయాన్నే మరిచిపోయారు. అదే సమయంలో వరద ప్రవాహంలో చిక్కుకున్న గొర్రెలు, ఆవులను కూడా ప్రత్యేక బృందాలు రక్షించడం విశేషంగా నిలిచింది. నీటిలో నుంచి బయటకు తీసిన పశువులకు పశువైద్య సిబ్బంది తక్షణ చికిత్స అందించారు. రక్షించిన బాధితుల్లో ఒకరు అపస్మారక స్థితిలో ఉన్నట్లు చూపించగా, వైద్య సిబ్బంది అక్కడికక్కడే సీపీఆర్ నిర్వహించి ప్రాణాలు కాపాడే విధానాన్ని ప్రదర్శించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో బాధితుడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవల స్పందనను వివరించారు. వరద బాధితుల కోసం అడెల్లి బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని అధికారులు సందర్శించారు. అక్కడ బాధితులకు భోజన ప్యాకెట్లు, తాగునీరు, ఆరోగ్య సేవలు అందించే విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమాన్ని పరిశీలించిన డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రతి నిమిషం కీలకమని, అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన స్పందన ద్వారా ప్రాణనష్టం తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ మాక్ డ్రిల్ స్థానిక ప్రజలు, విద్యార్థులు, అధికారులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రత్యక్ష విపత్తు జరిగినట్టుగా కనిపించిన ఈ విన్యాసాలు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే అంశంపై స్పష్టత కల్పించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సుమ, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సాంబశివరావు, అగ్నిమాపక శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# జయగిరి గ్రామంలో ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాలు

**పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**
**గౌడ సంఘం నాయకులకు సన్మానం**



**హనుమకొండ జిల్లా/జయగిరి, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

జయగిరి గ్రామంలో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి బోనాలు, అభిషేకం, కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు గౌరవ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎల్లమ్మ తల్లికి పూలమాల సమర్పించి పంచాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల సంక్షేమం కోరుతూ ప్రార్థనలు చేశారు. తదుపరి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే గౌడ సంఘం అధ్యక్షులు, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు కొత్తకొండ వెంకటేష్, కమిటీ సభ్యులు పల్లె కుమారస్వామి, తాళ్లపల్లి లక్ష్మీనారాయణ, కొత్తకొండ మొగిలి, తాళ్లపల్లి సదానందం, చింత సునీల్, వల్లాల రాజు, తాళ్లపల్లి హరీష్ తదితరులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా సత్కరించారు. అలాగే హసన్‌పర్తి మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, ఆత్మకూర్ మార్కెట్ డైరెక్టర్ పల్లె దయాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు రామంచ ప్రభాకర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏలిమి మమత, వార్డు సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, రేణికుంట్ల ఆనంద్, రేణికుంట్ల సంపూర్ణ కమలాకర్, కొత్తకొండ రేఖ కృష్ణంరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిట్టల రాజ్‌కుమార్, వల్లాల అశోక్, కొత్తకొండ రవి, పంజాల పరమేశ్వర్, పంజాల సాంబరాజులతో పాటుగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందారు.

# తెలంగాణలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై తెలంగాణ ఓఎంసీల కీలక ప్రకటన

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరతపై రాష్ట్రంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) కీలక ప్రకటన చేశాయి. రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని తెలంగాణ రాష్ట్రంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు వెల్లడించాయి. సరఫరాను ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ తెలిపారు. రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు చమురురంగ కంపెనీలు తెలిపాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహ అవసరాల ఎల్పీజీ సిలిండర్ల బుకింగులు తగ్గుముఖం పట్టినట్లు వెల్లడించాయి. వినియోగదారులు ఆందోళనతో ముందస్తు బుకింగ్స్ చేసుకోవద్దని కోరాయి. ఈ నెలలో 17వ తేదీ వరకు మొత్తం 20.06 లక్షల ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేసినట్లు వెల్లడించాయి. ఈ సీజన్‌కు ఇది సాధారణమేనని, ఎస్సెమ్మెస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# మాకు ఇల్లు ఇవ్వండి లేదా మమల్ని జైలుకు పంపండి





**బెంగళూరు, జై భీమ్ న్యూస్ :**

"మాకు తలదాచుకోవడానికి చోటు కల్పిస్తే, దీనికి బాధ్యులైన వారందరినీ ధన్యవాదాలు తెలిపి ప్రశాంతంగా బతుకుతాం. లేకపోతే, కనీసం మమ్మల్ని జైల్లో పెట్టండి. అప్పుడు మాకు నివసించడానికి ఒక చోటు, రోజుకు మూడు పూటల భోజనం అయినా లభిస్తుంది." అని ప్రభుత్వం తమ ఇళ్లను కూల్చివేయడంతో నిరాశ్రయులైన కోగిలు లేఅవుట్ మురికివాడ నివాసితుల ఆవేదన ఇది. డిసెంబర్ 20, 2025న, బెంగళూరు ఉత్తర తాలూకాలోని యలహంక ప్రాంతంలో ఉన్న కోగిలు లేఅవుట్‌లోని రెండు వందలకు పైగా పేద కుటుంబాల ఇళ్లు అక్రమమైనవని పేర్కొంటూ గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) వాటిని కూల్చివేసింది. ప్రజలు నిద్రలేవక ముందే, తెల్లవారుజామున అధికారులు చేపట్టిన ఈ ఆపరేషన్, షెడ్యూల్డ్ కులాలు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, అసంఘటిత కార్మికులు, గృహ కార్మికులతో సహా వివిధ వర్గాలకు చెందిన పేద ప్రజలను వీధిపాలు చేసింది. ఇళ్లు కూల్చివేసిన 8 రోజుల తర్వాత పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాజీవ్ గాంధీ హౌసింగ్ కార్పొరేషన్ అత్యవసరంగా సర్వేను పూర్తి చేసింది. పత్రాల పరిశీలన ప్రక్రియ కూడా పలు దశల్లో జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి కూడా పునరావాసం గురించి బహిరంగంగా వాగ్దానాలు చేశారు. అయినప్పటికీ, మేము 148 రోజులుగా వీధుల్లోనే జీవిస్తున్నాము. తీవ్రమైన ఎండ, వాన, అనారోగ్యం ఉన్నప్పటికీ, పిల్లలు, మహిళలు, వృద్ధులతో సహా మేమంతా అత్యంత అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నాము," అని నిర్వాసితులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక సామరస్య సమితి రాజ్య అధ్యక్షుడు కన్నలి కృష్ణప్ప మాట్లాడుతూ "పేదల పక్షాన ఉంటామని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మా జీవితాలను పునర్నిర్మించుకోవడానికి సహాయం చేస్తుందని మేము ఆశించాము. అయితే, ఈ రోజు అది అబద్ధం అయ్యింది. ప్రజలకు పునరావాసం కల్పిస్తామని వాగ్దానం చేసి 138 రోజులు గడిచాయి. పలు దశల పత్రాల పరిశీలన జరిగినప్పటికీ, ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన మాకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలను పొందడం షెడ్యూల్డ్ కులాలు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, అసంఘటిత కార్మికులమైన మాకు ఎంత కష్టమో ప్రభుత్వానికి తెలుసు," అని ఆయన అన్నారు. నిరాశ్రయుల ప్రకారం, ఇల్లు పొందడానికి ప్రభుత్వం కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, నివాస ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఓటర్ ఐడి కార్డు, ఆధార్ కార్డు మరియు బ్యాంకు పాస్‌బుక్‌ను తప్పనిసరి పత్రాలుగా అడుగుతోంది. చాలా మందికి ఓటర్ ఐడీ కార్డులు, పాన్ కార్డులు, ఆధార్ కార్డులు మరియు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. అయితే, ఇళ్లు కోల్పోయిన వారు అణగారిన వర్గాలకు చెందినవారు కాబట్టి, చాలా మందికి మిగిలిన మూడు పత్రాలు లేవు. 10 శాతం కంటే తక్కువ మంది వద్ద మాత్రమే కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఉన్నాయి. ఈ పత్రాలను పొందడానికి టీసీ ని తప్పనిసరి చేశారు. మా పిల్లలే విద్యను పొందుతున్న మొదటి తరం. మా వద్ద టీసీలు లేవు. అందువల్ల, మేము కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను పొందలేకపోయాము. నివాస ధృవీకరణ పత్రం పొందవలసిన అవసరం గురించి అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది వద్ద ఈ పత్రాలు లేవు. 36 శాతానికి పైగా ప్రజల వద్ద రేషన్ కార్డులు ఉన్నాయి. "రేషన్ కార్డులు పొందడంలో ఉన్న అనేక సాంకేతిక అడ్డంకులు, పత్రాల కొరత, మరియు 2017 నుండి కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి కేవలం కొన్ని గంటల సమయం మాత్రమే ఇవ్వడం వంటి కారణాల వల్ల మేము రేషన్ కార్డులు పొందలేకపోతున్నాము," అని తెలిపారు. ఇల్లు పొందడానికి మాకు అడ్డంకిగా ఉన్న పత్రాల సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే, "ప్రభుత్వమే మమ్మల్ని శాశ్వతంగా వీధుల్లోనే నివసించే పరిస్థితికి నెట్టివేస్తుంది," అని అన్నారు.

## జన్ భాగిదారి - సబ్సే దూర్, సబ్సే పహ్లే వారోత్సవ అభియాన్ ప్రారంభం



**వరంగల్, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లాలో డిఎజెజియూఎ (ధర్తి ఆబా గ్రామ ఉత్కర్ష అభియాన్) కార్యక్రమాల అమలులో భాగంగా "జన్ భాగిదారి -- సబ్సే దూర్, సబ్సే పహ్లే" పేరుతో ప్రత్యేక వారోత్సవ అభియాన్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాలు మే 18 నుంచి 25 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడనున్నాయి. వరంగల్ జిల్లాలోని 8 మండలాలు, 15 గ్రామాలు/హ్యాబిటేషన్లలో గిరిజన సంక్షేమ శాఖతో పాటు వివిధ శాఖల సమన్వయంతో అభియాన్ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు ప్రత్యేక ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. అభియాన్ లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళిక, శాఖల బాధ్యతలపై అవగాహన కల్పించారు. అభియాన్‌లో భాగంగా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, జీవనోపాధి ప్రోత్సాహక కార్యక్రమాలు, అర్హతల నమోదు శిబిరాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా నోడల్ అధికారి పర్యవేక్షణలో, మండల స్థాయిలో ఎంపీడీఓలను బ్లాక్ నోడల్ అధికారులుగా, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులను గ్రామ నోడల్ అధికారులుగా నియమించనున్నట్లు వెల్లడించారు. సంబంధిత గ్రామ పంచాయతీ భవనాలు "ఆది సేవా కేంద్రాలు"గా పనిచేయనున్నాయి. అభియాన్ షెడ్యూల్‌లో భాగంగా మే 20న "గ్రామ సంపర్క కార్యక్రమం", మే 21 నుంచి 23 వరకు "జన్ సున్వాయి" కార్యక్రమాలు, మే 24న ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డులు, డాక్యుమెంటేషన్, మే 25న జిల్లా స్థాయి డీబ్రీఫింగ్, సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రభుత్వ సేవల సమర్థవంతమైన చేరిక, ప్రజల సమస్యల వేగవంతమైన పరిష్కారమే ఈ అభియాన్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జెడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నారాయణరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## బాబాపూర్‌లో ఘనంగా దీప్తి షర్మిల నూతన వస్త్రాలంకరణ మహోత్సవం

ఆశీస్సులు అందించిన టీఆర్ నైన్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ డోంగ్రీ రవీందర్



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామంలో చునార్కర్ దీపక్--దర్శన దంపతుల ఏకైక పుత్రిక దీప్తి షర్మిల నూతన వస్త్రాలంకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలో చిన్నారికి నూతన వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్ నైన్ టీవీ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ డోంగ్రీ రవీందర్ పాల్గొని దీప్తి షర్మిలకు ఆశీస్సులు అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంచి విద్యతో పాటు సంస్కారం, కుటుంబ విలువలను అలవరుచుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, సాంప్రదాయ వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. ఈ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్.. ఇక ప్రయాణం సుఖమయం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణికులకు త్వరలోనే పెద్ద ఊరట లభించనుంది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లలో ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. బెంగళూరుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) నుంచి ఈ కోచ్‌లను కొనుగోలు చేయనున్నారు. ఈ వారంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, బీఈఎంఎల్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కారిడార్లలో మొత్తం 56 రైళ్లు సేవలందిస్తున్నాయి. ఒక్కో రైలుకు మూడు కోచ్‌లు మాత్రమే ఉండటంతో ప్రతిరోజూ ప్రయాణించే దాదాపు 5 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎల్బీనగర్ - మియాపూర్, నాగోల్ - రాయదుర్గం మార్గాల్లో రైళ్లలో నిలబడటానికి కూడా చోటు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే అదనపు కోచ్‌ల కొనుగోలు అనివార్యంగా మారింది. ఆర్డర్ ఇచ్చిన నాటి నుంచి కేవలం 15 నెలల వ్యవధిలోనే కొత్త కోచ్‌లను సరఫరా చేస్తామని బీఈఎంఎల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. గతంలో రద్దీని అధిగమించేందుకు నాగ్‌పూర్ మెట్రో నుంచి కొన్ని కోచ్‌లను లీజుకు తీసుకోవాలని ప్రయత్నించినా, సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. అయితే, ఇటీవల హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో కోచ్‌ల కొనుగోలుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.

## భీమారం బస్టాండ్‌లో స్కూటీ కలకలం

20 రోజులుగా నిలిపివున్న వాహనంపై స్థానికుల్లో అనుమానాలు




**హనుమకొండ జిల్లా/హసన్‌పర్తి, మే 18 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలం భీమారం బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ స్కూటీని పార్క్ చేసి వెళ్లిపోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం భీమారం బస్టాండ్ సమీపంలోని సచిన్ సెలూన్ ఎదురుగా గ్రే కలర్‌కు చెందిన స్కూటీని సుమారు 15 నుంచి 20 రోజుల క్రితం కొందరు నిలిపివెళ్లినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఎవరూ వాహనాన్ని తీసుకెళ్లకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్కూటీ రిజిస్ట్రేషన్ నెంబర్ టీఎస్ 03 ఈఎఫ్ 2022గా గుర్తించారు. వాహనం యజమాని ఎవరు..? ఎందుకు అక్కడ వదిలివెళ్లారు..? అనే విషయాలపై స్పష్టత లేకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ఇన్ని రోజులుగా ఒకేచోట వాహనం ఉండటంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. ప్రజలు కూడా అనుమానాస్పద వస్తువులు, వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులు సూచిస్తున్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆధునీకరించిన కార్యాలయాల ప్రారంభం



**హన్మకొండ, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని మొదటి అంతస్తులో నూతనంగా ఆధునీకరించిన కార్యాలయాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత వైస్ ఛాన్సలర్ కార్యాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో రిజిస్ట్రార్ పేషీగా మార్చగా, ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రార్ పేషీని ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి కార్యాలయంగా కేటాయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మరియు ఆచార్య బి. వెంకట్రామరెడ్డిని పుష్పగుచ్ఛాలతో అభినందించారు. విశ్వవిద్యాలయ పరిపాలనా వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు చేపట్టిన ఈ చర్యలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## కేబీఆర్ పార్కు వద్ద చెట్ల నరికివేత... సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో తదుపరి విచారణ వరకు చెట్లను కొట్టేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పార్కు పరిధిలో పర్యావరణపరంగా సున్నిత ప్రాంతంలో 25 నుంచి 30 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను కొట్టివేయవద్దని ఆదేశించింది. ఈ పనుల కోసం పార్కు పరిధిలో సుమారు 1,300 చెట్లు నరికేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. చెట్లు తొలగించడానికి ప్రణాళిక ఏమైనా ఉందా? చెట్లు తొలగించకుండా నిర్మాణం చేయవచ్చా? అని న్యాయస్థానం ప్రశ్నించింది. అలాంటి ప్రణాళిక ఏమీ లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రభుత్వమే చెట్లను తొలగిస్తోందని ఆరోపించారు. వాదనల అనంతరం ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది.

# తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులకు ఘన సన్మానం




**దేశంలోనే ప్రత్యేకతను చాటుకున్న తెలంగాణ పోలీస్ శాఖ.**
**తెలంగాణను నక్సల్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దిన పోలీసు అధికారులను సన్మానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

**జగదల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), మే 18 జై భీమ్ న్యూస్:**

భారతదేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని మరోసారి నిరూపితమైంది. దేశం నుండి వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించి, నక్సల్ రహిత సమాజాన్ని నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మావోయిస్టు కార్యకలాపాలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులను, సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. నక్సలిజాన్ని పూర్తిగా అణచివేసి, తెలంగాణను నక్సల్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రధాన భూమిక పోషించిన తెలంగాణ పోలీసు శాఖకు చెందిన సీనియర్ అధికారులు, తమ విశిష్ట సేవలు మరియు కృషికి గుర్తింపుగా ఈ సన్మానాన్ని అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా, తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) సివి. ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, డిజిపి ఆపరేషన్స్ (ఆక్టోపస్ అండ్ గ్రేహౌండ్స్ ) డాక్టర్ అనిల్ కుమార్ (ఐజిపి), మల్కాజిగిరి కమిషనర్, మాజీ ఎస్ఐబి ఐజిపి సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబి బృందాన్ని కేంద్ర హోం మంత్రి సన్మానించారు. వామపక్ష తీవ్రవాద నిర్మూలన పోరాటంలో వారు చేసిన అద్భుతమైన కృషికి, అంకితభావంతో కూడిన సేవలకు ఆయన వారిని అభినందించారు. సభను ఉద్దేశించి ప్రసంగించిన అమిత్ షా, జనవరి 2024లో జరిగిన ఒక అంతర్గత సమీక్షా సమావేశంలో, దేశం నుండి నక్సలిజాన్ని పూర్తిగా తుదముట్టించడానికి మార్చి 31, 2026ను లక్ష్య తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. "మేము ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు, ఇటువంటి లక్ష్యాన్ని సాధించడం సాధ్యమేనా అని చాలామంది వ్యక్తిగతంగా సందేహాలు వ్యక్తం చేశారు. అయితే, మేము ఒక స్పష్టమైన దార్శనికతతో పక్కా వ్యూహంతో ముందుకు సాగాము. నేడు, దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో, బస్తర్ ప్రాంతం నక్సల్ రహిత ప్రాంతంగా ప్రకటించబడిందని తెలియజేయడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను," అని ఆయన పేర్కొన్నారు. వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం సాగిస్తున్న సుదీర్ఘ పోరాటంలో, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నక్సలిజం ముప్పు నుండి విముక్తి పొందడాన్ని ఆయన ఒక చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించారు. 1970ల నుండి మార్చి 31, 2026 వరకు-సుమారు మూడు తరాల పాటు దేశం నక్సలిజం సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చిందని హోం మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాలు తీవ్రమైన రక్తపాతాన్ని, అభివృద్ధి స్తంభనను యువత భవిష్యత్తు పట్ల అనిశ్చితిని చవిచూశాయని ఆయన గుర్తుచేశారు. నక్సలిజంపై పోరాటంలో దేశంలోని దాదాపు ప్రతి రాష్ట్రానికి చెందిన సిబ్బంది అత్యున్నత త్యాగాలు చేశారని అమిత్ షా పేర్కొన్నారు; వారి అంకితభావం మరియు త్యాగాల వల్లే నేటి విజయం సాధ్యమైందని ఆయన నొక్కి చెప్పారు. నక్సలిజం ఎప్పుడూ ఒకే ప్రాంతానికి పరిమితం కాలేదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో సహా దేశవ్యాప్తంగా అది ఆందోళన కలిగించే అంశంగానే కొనసాగిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విజయం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఒకప్పుడు అసాధ్యమైన లక్ష్యంగా భావించిన దానిని-భద్రతా దళాలు మరియు ప్రభుత్వాలు సమన్వయంతో కలిసి పనిచేయడం ద్వారా-తమ దృఢసంకల్పం మరియు పట్టుదలతో సాధించగలిగామని అమిత్ షా తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు సీనియర్ అధికారులు, అలాగే వివిధ భద్రతా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీలో పదవుల కేంద్రీకరణపై ఆగ్రహం





**ఓఎస్డీ పదవి నుంచి ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డిని తొలగించాలని విద్యార్థి సంఘాల డిమాండ్**
**అక్రమమైన పదవిని సక్రమంగా కొనసాగిస్తున్నారు**
**కేయూలో కొత్త రకపు ఇంక శక్తులను పెంచి పోషిస్తున్న వెంకట్రామ్ రెడ్డి**
**కేయూలో ఓఎస్డీ పదవిని పూర్తిగా రద్దు పరచాలి**
**అకుట్ ప్రెసిడెంట్గా ఉంటూ ఓఎస్డి పదవిని లాక్కోవడం సిగ్గుకరం**
**అప్పట్లో మల్లారెడ్డి ఇప్పుడు వెంకటరామ్ రెడ్డి పదవుల మోజుతో కేయూ పరిపాలనను పతనం చేస్తున్నారు**

**కేయూ క్యాంపస్ / జై భీమ్ న్యూస్ :**

కాకతీయ యూనివర్సిటీలో పరిపాలనా పదవుల కేంద్రీకరణ, ఒకే వ్యక్తికి పలుమార్లు కీలక బాధ్యతలు అప్పగించడం, సామాజిక సమీకరణలకు విరుద్ధంగా నియామకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. యూనివర్సిటీలో ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా కొనసాగుతున్న ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డిని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి కలకోట్ల సుమన్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కాకతీయ యూనివర్సిటీ చాంబర్‌లో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంను కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, ఒకే ప్రొఫెసర్‌కు రెండు మూడు కీలక పరిపాలనా పదవులు అప్పగించడం వల్ల పరిపాలనలో పారదర్శకత దెబ్బతింటోందని ఆరోపించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని, అకడమిక్ వ్యవస్థపై కూడా దీని ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఓఎస్డీ వంటి కీలక పదవుల్లో సామాజిక సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని, బీసీ సామాజిక వర్గానికి చెందిన అర్హత కలిగిన ప్రొఫెసర్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మరియు రిజిస్ట్రార్ స్పందిస్తూ, ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తామని, నెలరోజుల వ్యవధిలో తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు.

### " ఒకే వ్యక్తికి ఎన్ని పదవులు?"

యూనివర్సిటీలో పెరుగుతున్న అసంతృప్తి కాకతీయ యూనివర్సిటీలో ఇటీవల కొందరు అధ్యాపకులు ఒకేసారి రెండు నుంచి మూడు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరిపాలన, ప్రత్యేక అధికారుల వంటి పోస్టుల్లో ఒకే వర్గానికి చెందిన వ్యక్తులు కొనసాగుతున్నారనే అభిప్రాయాలు విద్యార్థి వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తూ, "ఒక వ్యక్తి ఇప్పటికే కీలక పదవిలో ఉంటే మళ్లీ మరో పదవికి అవకాశం ఎలా కల్పిస్తున్నారు. యూనివర్సిటీలో అర్హులైన ఇతర ప్రొఫెసర్లు లేరా?అని ప్రశ్నించారు. నియామకాల్లో పారదర్శకత లేకపోవడం వల్లే ఇలాంటి అనుమానాలు తలెత్తుతున్నాయని అన్నారు.

### సామాజిక న్యాయం పాటించాలన్న డిమాండ్

విద్యార్థి సంఘాలు ప్రత్యేకంగా బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించాలని కోరడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయాల్లో కూడా అదే విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పరిపాలనా పదవులు కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమైతే సామాన్య వర్గాలకు అవకాశాలు దూరమవుతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్, ఎస్ఎస్యూత జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయి కుమార్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

### త్వరలో ప్రత్యేక కథనాలు?

కేయూ యూనివర్సిటీలో ఒకేసారి బహుళ పదవులు నిర్వహిస్తున్న వ్యక్తుల వివరాలు, నియామకాల విధానంలో కొనసాగుతున్న వ్యవహారాలపై పూర్తి ఆధారాలతో ప్రత్యేక కథనాలు "పారదర్శకత కోసం మా పోరాటం కొనసాగుతుంది" - జై భీమ్ ప్రతినిధి హన్మకొండ శ్రీకాంత్.

# 8 మంది వద్ద అప్పులు...

**అందులో ఇద్దరిని లేపేశారు...**
**రంగారెడ్డి జిల్లాలో దారుణం!**
**రంగారెడ్డి జిల్లాలో దారుణం**
**అప్పు ఇచ్చిన 8 మందిని చంపేందుకు ప్లాన్**
**ఇద్దరిని ఫామ్‌హౌస్‌కు పిలిపించి హత్య చేసిన నిందితులు**
**బతికిపోయిన మిగిలిన ఆరుగురు**

**రంగారెడ్డి, జై భీమ్ న్యూస్**

రంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది. తమకు అప్పు ఇచ్చిన వారిని చంపేసిన దారుణ సంఘటన వెలుగు చూసింది. జిల్లాలోని మొయినాబాద్ లో జంట హత్యలు జరిగాయి. ఈ కేసు విచారణలో పోలీసులకు విస్తుగొలిపే విషయాలు తెలిశాయి. కరీమా బేగం దంపతులు, మరో వ్యక్తి తమకు అప్పు ఇచ్చిన 8 మందిని చంపేందుకు ప్లాన్ చేశారు. అందులో ఇద్దరు మహిళలను చంపేశారు. మరో ఆరుగురిని కూడా హత్య చేసేందుకు ఫామ్‌హౌస్‌కు పిలిచారు. కానీ వారు రాకపోవడంతో ప్రాణాలు దక్కాయి. ఇద్దరు మహిళల హత్య ఘటన వెలుగు చూసిన తర్వాత తమకూ ప్రాణహానీ ఉందంటూ ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన అబేదాబేగం, మహబూబాబీ... అదే కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. డబ్బు తిరిగి ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని తొల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకువెళ్ళి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తర్వాత అబేదా బేగంను కూడా అదేవిధంగా హత్య చేశారు. మిగిలిన ఆరుగురు మహిళలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు తవ్వకాలు చేపట్టారు. మొదట మహబూబాబీ అస్తిపంజరం బయటపడింది. ఆ తర్వాత అబేదాబేగం మృతదేహం కూడా బయటపడింది. అనంతరం నిందితులను విచారించగా, అప్పు ఇచ్చిన ఆరుగురిని కూడా చంపేందుకు కూడా ప్లాన్ చేసినట్లు ఒప్పుకున్నారు.

# తెలంగాణలో మెడికల్ షాపుల బంద్‌కు ఫార్మాసిస్ట్ సంక్షేమ సంఘం వ్యతిరేకం

**ప్రజల ఆరోగ్య సేవలకు అంతరాయం కలిగించే ?**
**చర్యలను సమర్థించమన్న సంఘం**
**అక్రమంగా నడుస్తున్న మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**హైద్రాబాద్, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**



తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న మెడికల్ షాపుల బంద్‌కు ఫార్మాసిస్ట్ సంక్షేమ సంఘం 370/12 తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ప్రజలకు అత్యవసరంగా అవసరమయ్యే ఔషధాల సరఫరా ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోకూడదని, ఆరోగ్య సేవలకు అంతరాయం కలిగించే చర్యలు సమాజానికి ప్రమాదకరమని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధి డా. మేరుగు రాధా క్రిష్ణ గౌడ్ మాట్లాడుతూ మెడికల్ షాపులు కేవలం వ్యాపార కేంద్రాలు మాత్రమే కాకుండా ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న సేవా కేంద్రాలని అన్నారు. ముఖ్యంగా అత్యవసర వైద్య పరిస్థితుల్లో మందులు అందుబాటులో లేకపోతే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు ప్రజలకు సేవలందించే మెడికల్ షాపులు బంద్ చేయడం వల్ల గుండెజబ్బులు, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అత్యవసర చికిత్స అవసరమైన రోగుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని పేర్కొన్నారు. ఫార్మసీ రంగంలో చట్టాలను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని డా. రాధా క్రిష్ణ గౌడ్ స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఫార్మాసిస్ట్ పర్యవేక్షణలోనే మెడికల్ షాపులు నడవాలని, ఫార్మసీ సర్టిఫికెట్‌లను అద్దెకు తీసుకుని షాపులు నిర్వహించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తెలిపారు. ఇటువంటి అక్రమాలు ప్రజల ఆరోగ్య భద్రతకు ముప్పుగా మారుతున్నాయని అన్నారు. కొంతమంది వ్యాపార ప్రయోజనాల కోసం ఫార్మసీ వృత్తిని దుర్వినియోగం చేస్తున్నారని, ఇది ఫార్మాసిస్ట్ వృత్తి గౌరవాన్ని దెబ్బతీసే చర్య అని విమర్శించారు. అర్హతలేని వ్యక్తులు మందుల విక్రయాల్లో పాల్గొనడం వల్ల ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అక్రమంగా నడుస్తున్న మెడికల్ షాపులపై ప్రభుత్వం, డ్రగ్ కంట్రోల్ అధికారులు, సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సంఘం డిమాండ్ చేసింది. చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుని ఫార్మసీ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని కోరింది. అలాగే ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫార్మసీ రంగానికి సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, బంద్‌ల వంటి చర్యలకు దూరంగా ఉండాలని ఫార్మాసిస్ట్ సంక్షేమ సంఘం 370/12 సూచించింది.

# ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని జయించాలి

**ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ**
**153 మంది దివ్యాంగ విద్యార్థులకు సహాయక పరికరాల అందజేత**





**హన్మకొండ, 18 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష మరియు అలింకో ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సుబేదారిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన 153 మంది దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల సహాయక పరికరాలను అందజేశారు. విద్యార్థులకు వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, రోలేటర్లు, సీపీ చైర్లు, వినికిడి యంత్రాలు, టిఎల్ఎం కిట్లు, బ్రెయిలీ కిట్లు తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యాన్ని కూడా జయించవచ్చు అని అన్నారు. వైకల్యం అనేది కేవలం శరీరానికే తప్ప మేధస్సుకు కాదని, ఎంతోమంది దివ్యాంగులు తమ ఆత్మవిశ్వాసంతో జీవితంలో అద్భుత విజయాలు సాధించారని గుర్తు చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించి సాధారణ పిల్లల మాదిరిగానే విద్యాభ్యాసంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమాజంలో వారికి సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా విలీన విద్య సమన్వయకర్త (సీఎంఓ) సుమాదేవి మాట్లాడుతూ భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, సాధారణ పాఠశాలల్లో చదువుతూ ఇతరుల సహాయంతో పాఠశాలకు వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్, కంటిచూపు తక్కువగా ఉన్న విద్యార్థులకు రీడర్ అలవెన్స్ వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. పూర్తిగా పాఠశాలకు రాలేని విద్యార్థులకు ఇంటివద్దనే విద్య అందిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగ విద్యార్థులు స్వయంగా రోజువారీ కార్యకలాపాలు నిర్వహించుకునేలా ప్రభుత్వం ఉచితంగా ఉపకరణాలను అందిస్తున్నట్లు తెలిపారు. అందించిన పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేక సదరం క్యాంపులు నిర్వహిస్తామని, సదరం సర్టిఫికెట్ రిన్యువల్ ఉన్నవారు వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు. లేదంటే ప్రభుత్వ పథకాల లబ్ధి నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ ద్వారా వైకల్యాన్ని కొంతవరకు అధిగమించవచ్చని వివరించారు. హనుమకొండ మండల విద్యాధికారి నెహ్రూ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను క్రమం తప్పకుండా భవిత కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు కూడా సాధారణ విద్యార్థుల మాదిరిగానే అన్ని రంగాల్లో రాణించగలరని పేర్కొన్నారు. వారిపై ఎలాంటి వివక్ష చూపరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ అధికారి మహేష్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి మన్‌మోహన్, జిసిడిఓ సునీత, ఐఈఆర్పిస్, ప్రత్యేక ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

# రష్మిక టాటూ వెనుక ఆసక్తికర ఘటన!

రష్మిక మణికట్టుపై 'ఇర్రీప్లేసబుల్' అనే టాటూ

కాలేజీ రోజుల్లో రష్మికకు ఎదురైన ఒక అనుభవం

అమ్మాయిలు నొప్పిని భరించలేరని ఎగతాళిగా మాట్లాడిన ఒక అబ్బాయి


ఆ మాటలను ఛాలెంజ్‌గా తీసుకున్న రష్మిక



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న నటనతోనే, తన వ్యక్తిగత విషయాలతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఆమె కుడిచేతి మణికట్టుపై ఉన్న 'ఇర్రీప్లేసబుల్' అనే టాటూ గురించి సోషల్ మీడియాలో నిరంతరం రకరకాల పుకార్లు షికారు చేస్తూనే ఉన్నాయి. ఈ టాటూను ఆమె హీరో విజయ్ దేవరకొండ కోసమే ప్రత్యేకంగా వేయించుకుందంటూ నెటిజన్లు రకరకాల కథనాలను ప్రచారం చేస్తున్నారు. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన రష్మిక, ఈ టాటూ వెనుక ఉన్న అసలైన నిజాన్ని, దానికి దారితీసిన ఆసక్తికరమైన నేపథ్యాన్ని బయటపెట్టి ఆ పుకార్లకు పూర్తిగా చెక్ పెట్టారు.నిజానికి తనకు మొదట్లో శరీరంపై ఎలాంటి టాటూ వేయించుకోవాలనే ఆలోచనే లేదని రష్మిక స్పష్టం చేశారు. కానీ ఆమె కాలేజీ చదువుతున్న రోజుల్లో జరిగిన ఒక చిన్న సంఘటన ఆమె మనసును బలంగా తాకింది. ఒకరోజు కాలేజీలో ఒక అబ్బాయి రష్మిక దగ్గరకు వచ్చి, ఆడపిల్లలు అస్సలు నొప్పిని భరించలేరని... వారికి సూదులు, ఇంజెక్షన్లు అంటే చాలా భయమని కాస్త ఎగతాళిగా మాట్లాడాడు. ఆ మాటలను ఒక ఛాలెంజ్‌గా తీసుకున్న రష్మిక... ఆడవాళ్లు ఎంతటి నొప్పినైనా ఓర్చుకోగలరని నిరూపించడానికి, ఆ అబ్బాయి గర్వాన్ని అణచడానికే ఎలాగైనా టాటూ వేయించుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నారట. తీరా టాటూ వేయించుకోవాలని ఫిక్స్ అయిన తర్వాత, చేతిపై ఎలాంటి పదాన్ని రాయించుకోవాలా? అని చాలా సమయం ఆలోచించానని రష్మిక వెల్లడించింది. తన జీవితంలో ఎప్పుడూ చాలా సహజంగా, రియల్‌గా ఉండాలని కోరుకునే రష్మికకు ఒక బలమైన ఆలోచన వచ్చింది. ఈ ప్రపంచంలో ఏ ఒక్క మనిషిని మరొకరు ఎప్పటికీ భర్తీ చేయలేరని, ప్రతి ఒక్కరూ తమదైన శైలిలో ప్రత్యేకమైనవారని ఆమె బలంగా నమ్ముతారు. ఆ విషయాన్ని ప్రతిరోజూ తనకు తాను గుర్తుచేసుకోవడానికి, అలాగే తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఒక మంచి లక్ష్యంగా ఉంచుకోవడానికి 'ఇర్రీప్లేసబుల్' అనే పదాన్ని టాటూగా ఎంచుకున్నట్లు రష్మిక క్లారిటీ ఇచ్చారు.

# 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది.. థియేటర్లలో మెగా జాతర ఖాయం!

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది. సోమవారం సాయంత్రం 4.05 గంటలకు ముంబయి వేదికగా గ్రాండ్‌గా విడుదలైంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ట్రైలర్ చూస్తుంటే థియేటర్లలో మెగా జాతర ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రామ్‌చరణ్ మేకోవర్, ఆయన నటన, డైలాగ్స్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేలా ఉన్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ నేపథ్యం ఉన్న స్పోర్ట్స్ డ్రామాను దర్శకుడు బుచ్చిబాబు ఎంత ఎమోషనల్‌గా తెరకెక్కించారో ట్రైలర్ స్పష్టం చేస్తోంది. చరణ్ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఆటగాడిగా ఎదగడం గమనించొచ్చు. ఏఆర్ రెహ్మాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రత్నవేలు విజువల్స్ ట్రైలర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి.రామ్‌చరణ్ చెప్పిన కొన్ని డైలాగ్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. "మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు. నేను పోరాడాను సారు..." ఈ డైలాగ్ సినిమాలోని చరణ్ క్యారెక్టర్ తీవ్రతను, పోరాటాన్ని తెలియజేస్తోంది. "మాటలతో కాదు.. ఆటతో బరిలో గెలిచే మగతనం ఎవరికి ఉందో రమ్మను" అనే డైలాగ్ మాస్ ఆడియన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. మొత్తంగా 'పెద్ది' ట్రైలర్ సినిమాపై అంచనాలను ఓ రేంజ్‌కు తీసుకెళ్లింది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మనసుకు హత్తుకునే ఎమోషన్స్ ఉన్న పక్కా పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ మెటీరియల్‌లా ఇది కనిపిస్తోంది. జూన్ 4న థియేటర్లలో చరణ్ బాక్సాఫీస్ వేట ఎలా ఉండబోతుందో చూడాలి! వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ రాజ్ కుమార్, జగపతి బాబు, ఉపేంద్ర లిమయే, కృతిశెట్టి, దివ్యేందు శర్మ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.






# శ్రీలీల, తిలక్ వర్మ డేటింగ్ రూమర్స్.. ఫుల్ క్లారిటీ ఇచ్చిన హీరోయిన్ తల్లి

శ్రీలీల, తిలక్ వర్మ డేటింగ్ ప్రచారాన్ని ఖండించిన ఆమె తల్లి స్వర్ణలత

ప్రస్తుతం శ్రీలీల దృష్టి సినిమా కెరీర్, నీట్-పీజీ చదువులపైనే ఉందని వెల్లడి

తిరుమల దర్శనం, మ్యాచ్‌కు హాజరు కావడం యాదృచ్ఛికమేనని స్పష్టీకరణ

శ్రీలీల వ్యక్తిగత విషయాలపై ఆలోచించడానికి మరో 5-6 ఏళ్లు పడుతుందని వ్యాఖ్య

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల, టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె తల్లి స్వర్ణలత తెరదించారు. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆమె ఖరాఖండిగా తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న కథనాల్లో అణువంత కూడా నిజం లేదని, ఇలాంటి పుకార్లు ఎలా పుట్టుకొస్తాయో అర్థం కావడం లేదని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ఈ అంశంపై పూర్తి స్పష్టతనిస్తూ స్వర్ణలత మాట్లాడుతూ.. "ప్రస్తుతం శ్రీలీల తన సినీ కెరీర్‌తో పాటు చదువులపైనా పూర్తి దృష్టి పెట్టింది. సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సమయం దొరికినప్పుడల్లా తన వైద్య విద్యపై ఏకాగ్రత చూపుతోంది. ముఖ్యంగా నీట్-పీజీ పరీక్ష కోసం సన్నద్ధమవుతోంది. ఆమె వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించే దశకు ఇంకా చాలా సమయం ఉంది. బహుశా మరో ఐదు నుంచి ఆరు సంవత్సరాల తర్వాతే ఆ విషయాలపై దృష్టి పెడుతుంది" అని వివరించారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంఘటనల గురించి కూడా ఆమె ప్రస్తావించారు. 2025 డిసెంబర్‌లో తిరుమలలో శ్రీలీల, తిలక్ వర్మ కలిసి కనిపించడం, వాంఖడే స్టేడియంలో జరిగిన ఓ టీ20 మ్యాచ్‌కు శ్రీలీల హాజరుకావడం వంటివి కేవలం యాదృచ్ఛిక సంఘటనలేనని తెలిపారు. వాటి ఆధారంగా ఊహాగానాలు సృష్టించి సంబంధాన్ని అంటగట్టడం సరికాదని ఆమె హితవు పలికారు.గతంలో కార్తిక్ ఆర్యన్‌తో వచ్చిన వార్తలను కూడా గుర్తుచేసిన స్వర్ణలత గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి ప్రచారమే జరిగిందని స్వర్ణలత గుర్తుచేశారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల రిలేషన్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ.. "కార్తిక్ ఆర్యన్ తల్లి, నేను ఇద్దరం గైనకాలజిస్టులం. మా మధ్య ఉన్న వృత్తిపరమైన పరిచయాన్ని తప్పుగా అర్థం చేసుకుని అప్పట్లో ఇలాంటి కథనాలే సృష్టించారు" అని ఆమె పేర్కొన్నారు. సినీ తారల వ్యక్తిగత జీవితాలపై ఆధారాలు లేకుండానే కథనాలు ప్రచారం చేయడం తగదని, అభిమానులు ఇలాంటి పుకార్లను నమ్మవద్దని ఆమె సూచించారు.